ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 2 ఏప్రిల్ 2024



చలివేంద్రాలు ఎక్కడ?

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలో సోమవారం 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నగరానికి ప్రతీ రోజు వందల సంఖ్యలో రోజూ కూలీలు వస్తుంటారు. వారి దాహార్తి తీర్చేందుకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ అధికారులు ఏటా మార్చిలోనే బస్టాండ్స్, ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర 20 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇందుకోసం ఏటా సుమారు రూ.2లక్షల వరకు వెచ్చిస్తుంటారు. అయితే ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉన్నా.. ఇంతవరకూ కార్పొరేషన్ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారులు, కూలీలు, పనులపై వచ్చే వారి దాహార్తిని తీర్చాలని నగరవాసులు కోరుతున్నారు.





పాతపట్నంలో **మహేంద్ర తనయ** నదీజలాలు అడుగంటిపోయాయి. ఏటా ఏప్రిల్ రెండో వారం వరకూ కనీస నీటి ప్రవాహం ఉండేది. మేజర్ పంచాయతీ పాతపట్నంతోపాటు బూరగాం, కాగువాడ, కొరసవాడ, సీది, తామర, తీమర, పాశిగంగుపేట తదితర పంచాయతీల్లో రక్షితనీటి పథకాల వనరులు ఈ నదీ తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. నదీజలాల అడుగంటడంతో తాగునీటి ఎద్దడి నెలకొందని ఆయా గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు తాగునీరందించే **జగన్నాథసాగరం చెరువు** 75 శాతానికి పైగా ఎండిపోయింది. ఇది వంశధార ఆధారిత చెరువుగా పేరొందింది. ఈ చెరువులో రెండు భారీ బావులు నిర్మించి వాటి ద్వారా మునిసిపాలిటీకి తాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుతం బావుల్లో రెండు మీటర్ల నీరే లభ్యమవుతోంది. మునిసిపాలిటీ అవసరాలకు ఈ నీరు అందకపోవడంతో అధికారులు, పాలకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా 8 ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నారు. రూ.700కోట్లతో ప్రారంభించిన సమగ్ర మంచినీటి పథకాన్ని.. మునిసిపల్ మంచినీటి పథకానికి అనుసంధానం చేస్తే తాగునీటి ఇబ్బందులు ఉండవని అధికారులు సైతం చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.


దాహం కేకలు

- మొదలైన తాగునీటి కష్టాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- అల్లాడిపోతున్న జిల్లా ప్రజలు

(పలాస/ సరుబుజ్జిలి/ మెళియాపుట్టి/ పాతపట్నం/ సోంపేట/ నరసన్నపేట/ పలాస రూరల్)

వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా మార్చి నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. జిల్లాలో ఎక్కడ చూసినా తాగునీటి ఎద్దడితో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలతో జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. మెళియాపుట్టి మండలంలో కేరాశింగి, దీనబంధుపురం, మర్రిపాడు-సి, మెళియాపుట్టి, చాపర, వెంకటాపురం, కొత్తూరు, ఇలాయిపురం, పడ్డ, చీపురుపల్లి, పరశరాంపురం, భరణికోట, గేదెలపోలూరు గ్రామాల్లో తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. కొండపై ఉన్న గ్రామాల్లో గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

- ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలో 23 వార్డులకు పట్టణ ప్రాంతంలో ఉన్న గృహాలకు మాత్రమే తాగునీటి పైపులైన్లు వేశారు. వాటి నిర్వహణ సక్రమంగా లేక పైపులైన్లు పాడై తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. పట్టణ శివారున ఉన్న చింతాడ, తిమ్మాపురం, పార్వతీశునిపేట గ్రామాలకు మూడురోజులకోసారి మూడు ట్యాంకర్లతో మాత్రమే తాగునీరందిస్తున్నారు. దీంతో ట్యాంకర్ల కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు.
- సరుబుజ్జిలి మండలంలో సరుబుజ్జిలి, చిగురువలస గ్రామస్థులు ఇప్పటికీ పూర్వీకులు తవ్వించిన బావుల నీటినే తాగుతున్నారు. ప్రస్తుతం ఈ బావులు అడుగంటిపోవడంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. సరుబుజ్జిలిలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేసినా.. తాగునీరు సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారు. చిగురువలసలో జల్‌జీవన్ మిషన్ ద్వారా లభిస్తున్న నీరు తాగేందుకు పనికిరాకపోవడంతో పొలాల్లో బావినీటిని వినియోగిస్తున్నారు.
- నరసన్నపేటలో శివానగర్ కాలనీ, మారుతీనగర్, వీరన్నాయుడు కాలనీలో సరిపడా తాగునీరు రాక ట్యాంకుల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. కామేశ్వరిపేట కాలనీ, ఉప్పరిపేట, అంబోజీపేట గ్రామస్థులు వంశధార నదిలో చెలమనీటిని సేకరిస్తున్నారు. జమ్ములోని జగనన్న కాలనీలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- పలాస మండలంలో బాలాజీపూరు, గట్టూరు గిరిజన గ్రామాల్లో నీటి కొరత అధికంగా కనిపిస్తోంది. గట్టూరులో ట్యాంకులు నిర్మించినా కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో ఒకే బోరు నీటిపై ప్రజలు ఆధారపడుతున్నారు. బాలాజీపూరులో ప్రజలు ఒకే బావి నీటిని వినియోగిస్తున్నారు. ఈ గ్రామంలో బోరు వేసినా నీరు పడకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలింది. అలాగే సోంపేట మండలంలోనూ బావులు అడుగంటిపోయాయి. ఇలా జిల్లాలో ఎక్కడ చూసినా తాగునీటి ఇబ్బందులే. అధికారులు స్పందించి తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.



సోంపేట : అడుగంటినబావి



సరుబుజ్జిలి : చిగురువలసలోని పొలంలో బావి వద్ద నీటిని తోడుతున్న గ్రామస్థులు



పలాస రూరల్ : బాలాజీపూరులో ఈ బావే దిక్కు



మెళియాపుట్టి : గేదెలపోలూరులో గ్రావిటీ ద్వారా నీటిని శుభ్రం చేస్తున్న గిరిజనులు



ఆమదాలవలస : చింతాడలో ట్యాంకర్‌తో నీటి సరఫరా

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో నగదు స్వాధీనం

పలాసరూరల్/ నరసన్నపేట/ పోలాకి, ఏప్రిల్ 1: పలాస, వజ్రపుకొత్తూరు, పోలాకి మండలాల్లో సోమవారం ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని నగదు పట్టుబడింది. కంచిలి మండలం నారాయణపురానికి చెందిన కృష్ణారావు రూ.1,49,500 తీసుకెళ్తూ పలాస మండలం గరుడఖండి జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు పట్టుబడ్డారు. అలాగే పల్లివూరు వద్ద ఎస్.శంకరరావు బైక్‌పై వెళ్తుండగా అధికారులు తనిఖీ చేయగా రూ.1,02,350 నగదు లభ్యమైంది. ఇరువురు సరైన పత్రాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వెంకటరావు, వనిత తెలిపారు.

అలాగే పోలాకి మండలం ఆనుపత్రి జంక్షన్ వద్ద ఎన్నికల అధికారులు చేపట్టిన తనిఖీలో రూ.66 వేలు పట్టుబడినట్లు ఆర్వో జీవీఎస్ రామ్మోహన్‌రావు తెలిపారు. ఎటువంటి బిల్లులు లేకుండా ద్విచక్రవాహనంపై తరలిస్తున్న ఒక వ్యక్తి నుంచి ఈ నగదును డీటీ గాయత్రి బృందం స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ మొత్తాన్ని ట్రెజరీకి అప్పగించామన్నారు.





వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు గౌరిబాబు, రాంబాబు

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు

జలుమూరు, ఏప్రిల్ 1: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ కొంతమంది వలంటీర్లు వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రచారంలో పాల్గొనవద్దని ఎన్నికల సంఘం హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు. సోమవారం జలుమూరు మండలం బసివాడ, టెక్కలిపాడు గ్రామాల్లో పోలాకి జడ్పీటీసీ(వైసీపీ) ధర్మాన కృష్ణచైతన్య, సోదరుడు రామలింగన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బసివాడలో వలంటీరు వెలమల గౌరిబాబు, టెక్కలిపాడులో వలంటీరు యలమంచిలి రాంబాబు ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు వీరికి వర్తించవా.. అని పలువురు విమర్శించారు.

ర్యాలీకి వస్తారా.. ఐదొందలిస్తాం

టెక్కలి, ఏప్రిల్ 1: వైసీపీ ఎన్నికల ప్రచార ర్యాలీకి వస్తే రూ.500 ఇస్తామంటూ వలంటీర్లు.. వారి పరిధిలోని ఉన్నవారికి ఫోన్లు చేసి బతిమిలాడారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సోమవారం టెక్కలిలో కిల్లిపోలమ్మ ఆలయం వద్ద ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీకి వస్తే డబ్బులు ఇస్తామని, ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని వలంటీర్లు కోరారు. జనసమీకరణకు కుస్తీలు పట్టారు. ర్యాలీలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై వైసీపీ నిర్లక్ష్యం

- గంగాసాగరం రిజర్వాయర్‌కు నిధుల కొరత
- రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు

(కంచిలి)

సాగునీటి ప్రాజెక్టులపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. కంచిలి మండలంలో అవసరమైన జల వనరులు ఉన్నా.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో మినీ రిజర్వాయర్‌గా పిలుస్తున్న గంగాసాగరంతోపాటు గోవిందసాగరం, సుంకిలి సాగరం, లొద్దాలొద్ది, ముకుందసాగరం, హనుమత్ సాగరం, చిన్నా, పెద్దా చెరువులు సైతం ఎక్కువే ఉన్నాయి. అయితే ఏటా రైతులు సాగునీటి కోసం వర్షాధారంపై ఆధారపడాల్సి వస్తోంది. సుమారు 1,200 ఎకరాల ఆయకట్టు కలిగిన గంగసాగరం రిజర్వాయర్ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. 2007లో రిజర్వాయర్ ఏర్పాటు ప్రతిపాదనలు వచ్చి, భూ సేకరణ చేశారు. రూ.3 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించినా పూర్తి కాలేదు. అనంతరం 2019 ఫిబ్రవరి 15న స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ రూ.6.3 కోట్ల అంచనా వ్యయంతో రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి సాగరం చుట్టూ రాతితో గట్టు ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలంటే మరో రూ.4కోట్ల నిధులు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ఆశలు తీరేలా కనిపించడం లేదు. రిజర్వాయర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేసి.. కాలువలు సైతం మరమ్మతులు చేపడితేనే తమకు సాగునీటి ఇబ్బందులు తొలగుతాయని రైతులు పేర్కొంటున్నారు. అలాగే 350 ఎకరాల ఆయకట్టు ఉన్న సుంకిలి సాగరం, 150 ఎకరాల ఆయకట్టు ఉన్న గోవిందసాగరం కూడా అధ్వానంగా ఉన్నాయని చెబుతున్నారు. పాలకులు ప్రకటనలే తప్ప.. సాగునీటి అభివృద్ధికి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు.



అధ్వానంగా గంగసాగరం కుడికాలువ



నిలిచిన గంగసాగరం రిజర్వాయర్ పనులు

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 1: సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లాలో 732 సచివాలయాల ద్వారా ఒక్కో సచివాలయానికి సగటున 456 చొప్పున పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిలో తాగునీరు, ఉపాధిహామీ పథకం అమలు, విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. చెరువులను, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపాలని, నీటి నిల్వలను అనుసరించి వేసవి మొత్తం తాగునీటి సరఫరాకు ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. ఉపాధిహామీ పనుల్లో నీటి సంరక్షణ, తాగునీటి చెరువుల డీసిల్టింగ్ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో పరిస్థితులపై కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, వ్యవసాయాధికారి శ్రీధర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, సచివాలయాల నోడల్ ఆదికారి వాసుదేవరావు, డీపీవో వేంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పేడాడ పరమేశ్వరరావు



శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ టెక్కలి, ఏప్రిల్ 1 : సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను సోమవారం ప్రకటించింది. శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థిగా డా. పేడాడ పరమేశ్వరరావును ఖరారు చేసింది. ఈయన స్వగ్రామం ఇజ్జువరం. టెక్కలి అసెంబ్లీకి కోఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా, విజయనగరం కాంగ్రెస్ పార్టీ 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమం ఇన్‌చార్జిగాను వ్యవహరించారు. ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, అధికార ప్రతినిధిగా 2008 నుంచి 2010 వరకు కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ధర్మాన ప్రచారంలో కార్యకర్తల అత్యుత్సాహం

- బాణసంచా కాల్చడంతో గడ్డికుప్పలు దగ్ధం
- గ్రామస్థులు వారిస్తున్నా పట్టించుకోని వైనం

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 1: మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి చోటుచేసుకుంది. సోమవారం శ్రీకాకుళం మండలం తండేంవలస సమీపాన బెండివానిపేటలో ధర్మాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు బాణసంచా కాల్చారు. గడ్డికుప్పలు ఉన్నాయని.. ఇక్కడ బాణసంచా కాల్చొద్దని గ్రామస్థులు వారించినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో కుంచాల అప్పారావు, రమణకు చెందిన గడ్డికుప్పలపై తారాజువ్వలు పడి.. మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. వీరితోపాటు మరో రైతుకు చెందిన గడ్డికుప్ప కూడా అంటుకుంది. మంటలను ఆర్పేందుకు గ్రామస్థులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శ్రీకాకుళం, ఆమదాలవలస అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందజేయడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంత జరిగినా మంత్రి ప్రచారం ఆపలేదని, కనీసం బాధితులను పరామర్శించలేదనే విమర్శలు వెల్లువెత్తాయి.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తగ్గిన పనస ధర

- కేజీ రూ.5 నుంచి రూ.7లోపే..
- ఆందోళన చెందుతున్న రైతులు

(పలాస రూరల్)

ఉద్దాన ప్రాంతంలో జీడి తరువాత వ్యాపార పంటగా పేరొందిన పనసకు రేటు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కేజీ పనస రూ.12 నుంచి రూ.14వరకూ ఉండగా.. ప్రస్తుతం రూ.5 నుంచి రూ.7లోపే పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని విక్రయించలేక.. ఉంచలేక నానా యాతన పడుతున్నారు. ఉద్దానం పనసను ఉత్తరప్రదేశ్,బీహార్, వెస్టబెంగాల్, ఢిల్లీ వంటి నగరాలకు లారీల ద్వారా వ్యాపారులు తరలిస్తుంటారు. పచ్చికాయలను శుభకార్యాలు, పెళ్లిళ్ల వంటకాల్లో అధికంగా వినిగిస్తుంటారు. మార్చి, ఏప్రిల్‌లో వీటికి గిరాకీ అధికంగా ఉంటుంది. ఈ ఏడాది మాత్రం ఒక్కసారిగా ధర పడిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. మరింత కుదేలయ్యే పరిస్థితి ఉందని కొంతమంది రైతులు ఇదే ధరకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. జీడిసాగుతో పాటు పనస పంట కూడా ఈ ఏడాది తమకు కలిసిరాలేదని రైతులు పేర్కొంటున్నారు. కనీసం రవాణా చార్జీలు కూడా రావడం లేదని వాపోతున్నారు.



బొద్దపాడులో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న పనసకాయలు

అభివృద్ధికి ఆమడదూరం

- కనీస సదుపాయాలు మృగ్యం
- రోడ్లు, కాలువలు లేక ఇక్కట్లు
- ఇదీ గిరిజన గ్రామాల్లోని దుస్థితి

(పలాసరూరల్)

గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోక అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్లయినా గ్రామాల్లో అభివృద్ధిఛాయలు కనిపించడం లేదు. కనీస సదుపాయాలకు నోచుకోవడం లేదు. ఎన్నికలకు ముందు వచ్చే నాయకులు గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తామని హామీలిస్తున్నా ఆ తరువాత వాటిని మరిచిపోతుండడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా మండలంలోని లొద్దభద్ర పంచాయతీ పొత్రియ, బాపనూరు, రఘునాథపురం, తర్లాకోట పంచాయతీ బాలాజీపూరు, గట్టూరు, కొరారింగి తాళభద్ర తదితర గ్రామాలను చెప్పుకోవచ్చు. ఈ గ్రామాల్లో కనీస సదుపాయాలైన రోడ్లు, కాలువలు, తాగునీటి సదుపాయం లేవంటే అతిశయోక్తి కాదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. లొద్దభద్ర పంచాయతీకి సంబంధించి కోర్టులో కేసు ఉండడంతో పంచాయతీ పాలన లేదు. దీంతో వారి సమస్యలను వినే నాథుడే కరువయ్యారన్న ఆవేదన స్థానిక గిరిజనుల్లో కనిపిస్తోంది. పొత్రియ, బాపనూరు, రఘునాథపురం గ్రామాల్లో సరైన సీసీ రోడ్లు, కాలువలు లేక వారు ఇక్కట్లకు గురవుతున్నారు. తర్లాకోట పంచాయతీకి చెందిన బాలాజీపూరు, గట్టూరు, కొరారింగి తాళభద్రకు వెళ్లే రోడ్డు దారుణంగా ఉండి వారు నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు. ఈ మార్గంలో వర్షాకాలంలో 108 వాహనం వచ్చే పరిస్థితి లేదు. సరైన రహదారులు లేక అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లలేక ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొరారింగి తాళభద్రకు వెళ్లే దారి కచ్చా రోడ్డుతో నిండి ఉండడం, గులకరాళ్లు తేలి వాహనచోదకులు ప్రమాదా లకు గురవుతున్నారు. గ్రామంలో ఒక వీధికి మాత్రమే సీసీ రోడ్డు వేసి మిగతా రోడ్లను వదిలిపెట్టారు. కాలువల వ్యవస్థ లేదు. ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంటున్నా అధికారులు స్పందించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.


కొరారింగి-తాళభద్ర రహదారి ఇలా..


పొత్రియ గ్రామంలో కాలువలు లేని ఓ వీధి

అశ్రునయనాల మధ్య కళావతి అంత్యక్రియలు

- చితికి నిప్పంటించిన అచ్చెన్నాయుడు
- నాన్నమ్మ పాడెను మోసిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు


వందలాది మంది నడుమ కళావతమ్మ అంతిమయాత్ర

టెక్కలి, ఏప్రిల్ 1: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కింజరాపు కళావతి (90) అంత్యక్రియలు సోమవారం స్వగ్రామం నిమ్మాడలోని ఎర్రన్నాయుడు ఘాట్‌లో నిర్వహించారు. కళావతమ్మ పాడెను మనుమడు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర కుటుంబ సభ్యులు మోయగా చిన్న కుమారుడు అచ్చెన్నాయుడు హిందూ సంప్రదాయం ప్రకారం తల్లి అంత్యక్రియలు నిర్వహించారు. కళావతి మృతితో కింజరాపు కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలకు వేలాది మంది రాకతో నిమ్మాడ జనసంద్రమైంది. కుమారులైన కింజరాపు ప్రభాకర్, హరివరప్రసాద్‌తో పాటు రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పలువురి సంతాపం

కళావతి మృతి చెందిన విషయం తెలుసుకుని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, బీజేపీ నేత సీఎం రమేష్, టీడీపీ నేతలు అతిథి గజపతిరాజు, కోండ్రు మురళి, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, కలిశెట్టి అప్పలనాయుడు, బండారు సత్యనారాయణ, దువ్వా రపు రామారావు, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సూర్యనారాయణ తదితరులు కింజరాపు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే జిల్లా నలు మూలల నుంచి పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కింజరాపు కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక


గుంట సత్యంనకు టీడీపీ కండువా కప్పుతున్న గౌతు శిరీష

పలాస/వజ్రపుకొత్తూరు/హరిపురం, ఏప్రిల్ 1: వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిందపురం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్, వైసీపీ నాయకుడు గుంట సత్యం అనుచరులతో కలిసి ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం టీడీపీ పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస అభ్యర్థి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ ఓటమి తథ్యమని, పలాసలో తాను అధిక మెజార్టీ సాధిస్తానన్నారు. తాము గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ అవుతుం దన్నారు. అలాగే మందస మండలం నల్లబొడ్లూరు గ్రామం నుంచి ఐదు కుటుంబాలు వైసీపీని వీడి తెలుగు దేశంలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో బొడ్డు లోకేశ్వరి, హేమలత, పందిరి కల్పన, పాపారావు తదిరులున్నారు. అలాగే శాసనం గ్రామం నుంచి 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నేతలు పీరికట్ల విఠల్‌రావు, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గొరకల వసంతస్వామి, సూరాడ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యవస్థను భ్రష్టు పట్టించింది: బగ్గు

జలుమూరు: రాష్ట్రంలో ప్రజా వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం యలమంచిలి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని దోచుకొని అప్పులేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు నాయుడుకు మద్దతు ఇవ్వాలని, రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన-బీజేపీ కూటమిని అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనర్ బగ్గు గోవిందరావు, మాజీ సర్పంచ్ బైరి శిమ్మయ్య టీడీపీ మహిళా అధ్యక్షురాలు గురుబెల్లి ఝాన్సీ పాల్గొన్నారు.


యలమంచిలిలో ప్రచారం చేస్తున్న బగ్గు రమణమూర్తి

'సూపర్ సిక్స్'తో పేదలకు మేలు: ఎంజీఆర్


పథకాలను ప్రజలకు వివరిస్తున్న మామిడి గోవిందరావు

మెళియాపుట్టి: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలోని పేదలందరికీ మేలు చేకూరు తుందని పాతపట్నం ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. సోమవారం ముక్తాపురం, మర్రిపాడు-శె పంచాయతీల్లో ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అభివృద్ధికి మారుపేరన్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వస్తేనే యువతకు ఉపాధి, పేదవాడికి సంక్షేమం సాధ్యమన్నారు. చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, పట్టుపురం ఎంపీటీసీ నంబాళ్ల వెంకట్రావ్, ఎల్ఎం నాయుడు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: వేసవిలో వడగాలుల నుంచి రక్షణ కల్పించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులను చల్లని సమయంలో చేయించాలని, గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉర్లాం పీహెచ్‌సీ డాక్టర్ జి.సుజాత మాట్లాడుతూ.. ఈ ఏడాది వడ దెబ్బ ఎక్కువగా తగిలే అవకాశం ఉందని, గ్రామాల్లో ఆశాలు, మెడికల్ సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీవో యుగంధర్, ఈవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

పలాస: ఎండల తీవ్రత నేపథ్యంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కమిషనర్ టి.నాగేంద్రబాబు కోరారు. సోమవారం తన ఛాంబర్‌లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రహదారులు, ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారులకు ఊరట కలిగించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వనిత విభాగం అధ్యక్షురాలు మల్లా జయశ్రీ, కార్యదర్శి తర్లాన శ్వేత, సంతోషి, టి.రాజేశ్వరరావు, నాయుడు, కేవీ రామకృష్ణ, మల్లా సంతోష్, టీపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

జలుమూరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఎండలు తీవ్రత అధికంగా ఉన్నాయని, ఏ గ్రామం లోనూ తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఎ.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



సుసరాం(పోలాకి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకుగాను గ్రామాల్లో పోలీసులు ముందస్తుగా కవాతు నిర్వహించారు. నరసన్నపేట సీఐ, పోలాకి, నరస న్నపేట ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులు సుసరాం, సుసరాంకాలనీ, గంగివలస, గంగివలస కాలనీ గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

'సూపర్ సిక్స్'పై అవగాహన

పలాసరూరల్: టెక్కలిపట్నం గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో సోమవారం శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ అందించి టీడీపీని గెలిపించాలని కోరారు. శిరీషకు స్థానికులు తిలకం దిద్ది హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, దువ్వాడ సంతోష్, అవుగాన దశరథ, చంద్రశేఖర్ అధికారి తదితరులు పాల్గొన్నారు. ● పలాస మండలం లక్ష్మీపురం గ్రామంలో సోమవారం ప్రజాగళం కార్య క్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ కుమార్, దువ్వాడ హర్ష పాల్గొన్నారు. లక్ష్మీపురంలో మాజీ ఎంపీపీ దువ్వాడ కృష్ణమూర్తితో ఆమె కొద్దిసేపు చర్చించారు. ● **పలాస:** పార్టీ కార్యాలయంలో క్లస్టర్-1 ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో నేతలతో సమావేశం నిర్వహించారు. శిరీష గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బడ్డ నాగరాజు, కొండే నర్సింహ, గోళ్ల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ● **హరిపురం:** మందస మండలం హంసరాళి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, క్లస్టర్ ఇన్‌చార్జి తమిరి భాస్కరరావు ఆధ్వర్యంలో సోమ వారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గౌతు శిరీష, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీకే నాయుడు, రట్టి లింగరాజు, డొంకురు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిపేట పంచాయతీలో..

కమ్మరిపేట(పోలాకి): చెల్లాయివలస పంచాయతీ కమ్మరిపేట, కోరాడ లచ్చయ్యపేట, చెల్లాయివలస, చింతువానిపేట గ్రామాల్లో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు మిరియబ్బిల్లి వెంకటఅప్పలనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మీడియా సెల్ ప్రచార కార్యదర్శి బగ్గు అర్చన, బైరి బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆలయంలో శాశ్వత యాగశాల

పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయ ప్రాంగణంలో నిర్మించిన శాశ్వత యాగశాలను ఈనెల 4న ఉదయం 9.10 గంటలకు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవో వాసుదేవరావు తెలిపారు. అనకా పల్లికి చెందిన యర్నాగుల మోహనరావు, కనకరత్నం దంపతుల స్మారికగా కుటుంబ సభ్యులు మోహనరావు అనూరాధ దంపతులు రూ.8 లక్షలతో దీని నిర్మాణం చేపట్టారన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా ఒడిశా డే



పాతపట్నం: స్థానిక ఒడియా ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం బీమ్‌సేన్ పండా ఆధ్వర్యంలో ఉత్కళ్ దివస్ (ఒడిశా డే) సోమవారం నిర్వహించారు. కటక్, పూరి, బాలే శ్వరం సంబల్పూర్, కోరాపుట్, గంజాం తదితర జిల్లాలతో కలిసి ఒడిశా ఏర్పాటైం దన్నారు. ఇప్పటికి 88 వసంతాలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో బి.శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలగ కుల సంఘ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సంఘ నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ఇచ్ఛాపురం: తెలగకుల సంఘ అధ్యక్షుడిగా కృష్ణ సాహును ఏకగ్రీవంగా కుల సంఘ ప్రతినిధులు ఎన్ను కున్నారు. సోమవారం స్థానిక జగన్నాథస్వామి ఆలయంలో కుల సంఘ సమావేశం నిర్వహించారు. ఇటీ వల కుల పెద్ద కేశవ అనారోగ్యంతో మరణించడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యదర్శిగా త్రినాథసాహు, కోశాధికారిగా సత్యనారాయణ సాహులను ఎన్నుకు న్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మాజీ కౌన్సిలర్ తెలుకుల శ్రీనివాససాహు, కాశీనాథ్ సాహు, సత్యనారాయణసాహు, దుర్గోసాహు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల విధులను సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్‌వీ లక్ష్మణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. విధులపై అలసత్వం వహించవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో కన్నబాబు, ఎంఈవో అరసాడ రవి, ఏవో ఎర్రా శారద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో ఉద్రిక్తత


- ఏకపక్షంగా భవనాలు తొలగిస్తున్నారని బాధితుల ఆవేదన

నరసన్నపేట, ఏప్రిల్ 1: కంబకాయి రోడ్డు విస్తరణ పనుల్లో సోమవారం ఉద్రిక్తత ఏర్పడింది. పనుల్లో భాగంగా కంబకాయ జంక్షన్ సమీపంలో దుకాణాల తొలగింపు ప్రక్రియను ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు చేపట్టారు. అయితే దుకాణాల తొలగింపులో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వ్యాపారులు ఆందోళన చేపట్టారు. కొంత సేపు ఉద్రిక్తత ఏర్పండింది. రోడ్డుకు రెండు వైపులా ఒకే కొల తల్లో దుకాణాలు తొలగించాల్సి ఉన్నా ఒక్కో దగ్గర ఒక్కోలా చేపడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తూ పనుల ను అడ్డుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా 10 అడుగులు తొల గించాల్సి ఉండగా తమ షాపుల వద్ద 13 అడుగులు తొలగించి రెండో వైపు పది అడుగులు తొలగించారని వ్యాపారి గోవింద రావు తదితరులు వాపోయారు. నిబంధనల మేరకే తొలగింపు చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్ అన్నారు. దీనిపై న్యాయపరంగా ఎదుర్కొంటామని బాధితులు చెబుతున్నారు. వార్డు సభ్యుడు జి.రామారావు మాట్లాడుతూ చెరువుగట్లపై భవనాలను పంచాయతీ అధికారులు కట్టిస్తున్నారని, వ్యాపారాలు జరిగే ప్రాంతాల్లో తొలగిస్తున్నారన్నారు. తొలగింపు ప్రక్రియను ఈవో చిన్నారావు తదితరులు పర్యవేక్షించారు.



కంబకాయి జంక్షన్ వద్ద మెయిన్ రోడ్డుపై షాపు తొలగింపును అడ్డుకుంటున్న బాధితులు

వీరగున్నమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం


వీర గున్నమ్మ స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

హరిపురం: మందస జమిందారీ విధానానికి, బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన సాసుమాను గున్నమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. సోమవారం బ్రిటీష్ పాలకుల తూటాలకు బలైన గున్నమ్మ, గుంట బుడియాడు, గొర్లె జగ్గయ్య, కర్రి కలియాడు, గుంట చిననారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల స్థూపం వద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరత్వం పొంది సాసుమాను గున్నమ్మ తదితరుల పోరాట స్ఫూర్తిని వివరించారు. ప్రకృతి సంపద ప్రజలందరిదని ఎలుగెత్తి చాటిన రైతుబిడ్డ గున్నమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కొర్ల హేమారావు చౌదరి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షన్ముఖరావు, హనుమంతు హనుమంతు ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

మందస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయా లని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు కోరారు. వీర గున్నమ్మ 84వ వర్ధంతి సందర్భంగా మందస జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మందస బస్టాడ్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలు పరిశ్రమలను, ఇతర సెక్టార్లను కార్పొరేట్ సంస్థకు అప్పగిస్తున్నాయని, వీటిపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయ కులు ఆర్.దిలీప్ కుమార్, అప్పలస్వామి, మట్ట ధర్మారావు, సవర గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు

6 నుంచి ఎస్ఏ-2 పరీక్షలు


పేపర్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

హిరమండలం: పాఠశాలల్లో ఈనెల 6వ తేదీ నుంచి సమ్మేటివ్ ఎసెస్‌మెంట్-2 (ఎస్ఏ) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయానికి 1వ తగరతి నుంచి 9వ తరగతి వరకు వచ్చిన ప్రశ్నాపత్రాలను సీఆర్‌ఎంటీలు, కార్యా లయ సిబ్బంది పాఠశాలలకు పం పేందుకు కట్టలను కడుతున్నారు. పరీక్ష జరిగే రోజునే ఆయా పాఠశాలలకు పశ్నా పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

వ్యవసాయ భూమి మార్పిడికి పరిశీలన

హిరమండలం: వ్యవసాయ భూమి వాణిజ్య భూమిగా మార్చేందుకు భూ యజమానులు చేసుకున్న దరఖాస్తులను సబ్‌కలెక్టర్ నూరుల్ కమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కోరాడ రెవెన్యూ పరిధి ప్రైవేటు డిగ్రీ కళాశాల సమీపంలోని సర్వే సంఖ్య 296లో 51 సెంట్లు, సినిమాహాల్ సమీపంలోని 311-4బై2లో 1.06 ఎకరాలు భూమిని సోమవారం పరిశీలించారు. అయనతోపాటు తహసీల్దార్ సుధాకర్ ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

కొత్తూరు: ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పూత దశలోనే జీడి పంట పాడైందని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కోరారు. సోమవారం గొట్టిపల్లి సచివాలయంలో వీఏఏకు వినతిపత్రం అందించారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ నేతలు నిమ్మక సంతోష్ కుమార్, గేదెల ధర్మారావు, తులసమ్మ పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి


నందిగాం: ఓటుహక్కుపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం


సరుబుజ్జిలి: పెద్దవెంకటాపురంలో ప్రమాణం

నందిగాం: ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రయోజనం ఉంటుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంసీసీ అధికారి జి.శివప్రసాద్ అన్నారు. సోమవారం పెద్ద తామరాపల్లి, సొంటినూరు, రాంపురం, రౌతుపురం తదితర గ్రామాల్లో వెలుగు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిం చారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కె.జాంబవతి, కార్యదర్శులు ఎస్.చంద్రశేఖరరావు, తిరుపతినాయుడు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

● **ఎల్.ఎన్.పేట:** ఓటుహక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టరు గవరయ్య అన్నారు. లక్ష్మీనర్సుపేటలో సోమవారం అవగాహన కలిగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ మన్మథ కుమార్‌మిశ్రో, వీఆర్వోలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. సోమవారం స్వయంశక్తి సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా మొబైల్‌లో గాని, సమీపంలో ఉన్న బీఎల్వో వద్ద గాని ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీతోపాటు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని వెలుగు సీసీ కూన రోజారాణి కోరారు. పెద్దవెంకటాపురంలో సోమవారం నీ ఓటు-నీభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పలువురు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారవేత్త మృతి


రామారావు(ఫైల్)

హరిపురం: హరిపురం పాత జాతీయరహదారిపై బీన్నల రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యాపారవేత్త నల్ల రామారావు (62) సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి రైస్‌మిల్లులో విధులు ముగించుకొని ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్న రామారావును జగన్నాథపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఎదురుగా బైక్‌పై వచ్చి ఢీకొన్నారు. దీంతో రామారావు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ముగ్గురు యువకుల్లో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై మందస ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గడ్డివాములు, బడ్డీ దగ్ధం

నందిగాం: బెజ్జిపల్లి గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు గడ్డివాములు, బడ్డీ దగ్ధమయ్యాయి. ఆస్తినష్టం సుమారు రూ.20 వేలు ఉంటుందని టెక్కలి అగ్నిమాపక అధికారి ఎస్.మల్లేశ్వరరావు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో పొందర తార కేశ్వరరావుకు చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతవ్వగా సమీపంలో ఉన్న గొర్లె పాపారావు బడ్డీకొట్టు కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న టెక్కలి అగ్నిమాపక అధికారి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు.

పట్టని ఎన్నికల కోడ్.. 'ఫిష్ ఆంధ్ర' ప్రారంభం


పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు

రణస్థలం: ఎన్నికల కోడ్ ఉంటుండగా ఎలాంటి ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలు, అధికారిక కార్యక్రమాలు చేపట్టేందుకు వీల్లేదు. అయితే ఇందుకు విరుద్ధంగా ఎచ్చెర్లలో ఫిష్ ఆంధ్ర షాపును సోమవారం ప్రారంభించడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. మత్స్యశాఖ అధికారులు దగ్గరుండి ఈ షాపును ప్రారంభించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.20 లక్షలు విలువ చేసే ఈ యూనిట్‌కు రూ.12 లక్షలు వరకు లబ్ధిదారునికి సబ్సిడీగా అందజేస్తారు. కాగా షాప్‌ను లబ్ధిదారుడే ఉదయం ప్రారంభించుకున్నాడని, తాము పరిశీలించేందుకే వెళ్లామని ఎఫ్‌డీవో ముసలినాయుడు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో షాపు పరిశీలించేందుకు డీడీతో కలిసి వెళ్లినట్టు చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

సోంపేట: సోంపేట తహసీల్దార్ కార్యాలయానికి ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. గతనెల 29న రెండేళ్లకే బీటలు శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించిన రెండేళ్లకే పగుళ్లు ఏర్పడడంతో పగుళ్లు ఏర్పడినచోట సిమ్మెంట్‌తో పనులు చేపట్టారు.

శిలాఫలకం మూశారు..


పేపర్లు అందించిన దృశ్యం

గార: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా బందరువానిపేటలో నా భూమి-నా దేశం శిలాఫలకంపై ఎటువంటి కాగితాలు అంటించకుండా అలాగే వదిలేశారు. దీనిపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారుల స్పందించారు. దీంతో ఈ శిలాఫలకంపై కాగితాలు అంటించి మూసి వేయించారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

ఆమదాలవలస: కొత్తవలస జంక్షన్ వద్ద 15 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ డీటీ కె.నీలిమ తెలిపారు. కొత్తవలస జంక్షన్ వద్ద ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాలను తనిఖీచేసినట్లు చెప్పారు.ఈ మేరకు కట్యాచార్యులపేట గ్రామానికి చెందిన మన్నేన తారకేశ్వరరావు బైక్‌పై 15 మద్యం క్వార్టర్ విస్కీ బాటిళ్లను తీసుకొని వెళ్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఈ మేరకు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని తారకేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేష్ చెప్పారు.

నెంబరు ప్లేట్‌పై పేర్లు రాస్తే చర్యలు


పేర్ల తొలగింపు పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైం: నెంబరు ప్లేట్లపై గుర్తింపు పేర్లు (పోలీసు, ప్రెస్, ఆర్మీ వంటివి) రాస్తే మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం తెలిపారు. నగరంలో సోమవారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్వి, త్రిచక్రవాహనాల నెంబరు ప్లేట్లపై ఉన్న గుర్తింపు పేర్లను పోలీసులు తొలగించారు. అలాగే అటువంటి 43 వాహనాలకు రూ.25,500 అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా సీఐ అవతారం మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు నెంబరు ప్లేట్లపై ఇటువంటి పేర్లు రాస్తున్నారని ఇకపై ఇటువంటి పేర్లు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు

● చోద్యం చూస్తున్న అధికారులు

గార: సముద్రతీర మత్స్యకార గ్రామమైన బందరువానిపేటలో ఏడేళ్ల కిందట గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ర్మించిన సామూహిక వ్యక్తిగత మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. లక్షలాది రూపాయలు వ్యయంతో నిర్మించిన ఈ మరుగుదొడ్ల వినియోగం కోసం అవసరమైన నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో వినియోగించే వీలులేకుండా పోయింది. అప్పటి నుంచి వినియోగం లేకపోవడంతో సుమారు 30 వ్యక్తిగత మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చుతో నిర్మించిన ఈ సామూహిక మరుగుదొడ్లు ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలమైన వ్యక్తిగత మరుగుదొడ్లు

ఎన్నికల విధుల్లోని ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ ఇతర అధికారులు

కలెక్టరేట్: ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని, అందుకు తగ్గ ప్రణాళికను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల నిర్వహణ అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి సోమవారం ఆయన ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ అండ్ హోం ఓటింగ్‌కు సంబంధించి అధికారుల బాధ్యతలు, నిర్వహించాల్సిన విధులపై అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏప్రిల్, మే నెలల్లో తేదీలవారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ సిబ్బంది కోసం అదనపు ఫారం-12 సిద్ధం చేసుకోవాలని, వారికి శిక్షణ తరగతులు నిర్వహించే సమయంలో అవసరమైన మేర కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫారం-12 అందజేసి, ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో ఒక అధికారిని కేటాయించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ.. ఈ ప్రక్రియకు సంబంధించి చేపట్టిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, ఎల్‌డీఎం సూర్యకిరణ్, డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు, డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం విజయకుమార్, ఎంపీఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రత మనందరి బాధ్యత


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: విద్యార్థులకు విద్యాభ్యాసం చేయడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి, వారి భద్రతను చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు కళాశాల యాజమాన్యంపై ఉందని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం వివిధ కళాశాలల యాజమాన్యాలతో 'విద్యార్థుల భద్రత-ఆత్మహత్యల నివారణ'పై ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాల, వసతి గృహాలకు వచ్చిన విద్యార్థుల ప్రవర్తనను ప్రతీ క్షణం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి విద్యార్థులను పరిశీలించి చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐవో పి.దుర్గారావు, ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీ ఎ.విజయకుమార్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వాడాడలో డీపీఎస్ వేదదికగా బోధి ధర్మ యుద్ధకళా క్షేత్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొని గతంలో నేర్చుకున్న యుద్ధ విద్యలను ప్రదర్శించారు. ప్రతిభ చూపి అర్హత సాధించిన వారికి బెల్ట్ గ్రేడింగ్ చేశారు. ఇందులో 65 మందికి వైట్ బెల్ట్, 80 మందికి ఎల్లో బెల్ట్, 50 మందికి ఆరెంజ్ బెల్ట్, పది మందికి గ్రీన్ బెల్ట్ సాధించారు. వీరందరికి నిర్వాహకులు బెల్ట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ధర్మశీల శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పహారాలో పైడితల్లి అమ్మవారి జాతర


అమ్మవారి జాతర వద్ద ప్రత్యేక బలగాలు

పొందూరు: పొందూరులో పైడితల్లి అమ్మవారి జాతర పోలీసుల పహారాలో జరుగుతోంది. ఏటా ఇక్కడ మూడు రోజుల పాటు జాతర జరుగుతుంది. ఈ ఏడాది ఎన్నికల కోడ్ రావడంతో జాతర నిర్వహణపై పోలీసుల ఆంక్షలు పెట్టారు. రాజకీయ పార్టీలు జోక్యం లేకుండా జరిగే జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకూడదని పోలీసు అధికారులు ఆంక్షలు పెట్టారు. ఈ నేపథ్యంలో అమ్మవారి జాతర కమిటీ సభ్యులు ఎస్పీని కలవడంతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనుమతి ఇచ్చారు. అయినా భారీగా ప్రత్యేక బలగాలను ఏర్పాటుచేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సోంపేటలో లిమ్మేశ్వరి జాతర

సోంపేట: సోంపేట అమ్మవారు లిమ్మేశ్వరీ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమయింది. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈజాతరలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అలంకరణలో అమ్మవారు →



జగన్‌ది నిరంకుశ పాలన: గొండు శంకర్


ప్రచారంలో పాల్గొన్న గొండు శంకర్ తదితరులు

అరసవల్లి: జగన్‌రెడ్డి ఐదేళ్ల నిరంకుశ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అథోగతి పాలయిందని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. సోమవారం నగరంలో విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన జనసేన, బీజేపీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఓటమి భయంతో వైసీపీ నాయకుల అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చల్లా వెంకటేశ్వరరావు, కోరాడ సర్వేశ్వరరావు, కోరాడ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో..

నగరంలోని 29, 30వ వార్డుల్లో శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి గొండు శంకర్ సోమవారం ప్రచారం చేపట్టారు. మార్కెట్, చంపాగల్లివీధి, దమ్మలవీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాండ్రంకి శంకర్, కోరాడ సర్వేశ్వరరావు, పాండ్రంకి రమేష్ నాయుడు, అశోక్ నాయుడు, మైలపల్లి నర్సింగరావు, ఇప్పిలి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తాం


రణస్థలం: బాణసంచా కాల్చుతూ ఎన్ఈఆర్, కలిశెట్టి సందడి

లావేరు: ఎన్డీఏ కూటమిలోని ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసి గెలిపించుకుంటామని టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఐ.తోటయ్యదొర అన్నారు. బొడ్డపాడు వద్ద గల ఓ ప్రైవేట్ గెస్ట్ హౌస్ వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు. ఎన్ఈఆర్, కలిశెట్టి మాట్లాడుతూ.. ప్రజాసేవకు ఒక్కసారి అవకాశం కల్పించాలని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. మండల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు కూనబిల్లి దామోదరావు, లంక రాంబాబు, లంకలపల్లి శ్రీనివాసరావు, పిన్నింటి మధుబాబు, ఇజ్జాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● **రణస్థలం:** మహంతిపాలెం గ్రామం నుంచి విజయనగరం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు సోమవారం ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారు తోటమ్మతల్లిని దర్శించుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డీజీఎం ఆనందరావు, లంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, పిన్నింటి భాను, రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధిపొందాలనే టీడీపీపై దుష్ప్రచారం


కవిటి: రామయ్యపుట్టుగలో మాట్లాడుతున్న అశోక్

కవిటి: నిధులు లేకపోవడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యం చేసి వాస్తవాలను కప్పిపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని టీడీపీపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆరోపించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటివద్దకే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం రామయ్యపుట్టుగలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లను ప్రజా సేవకులుగా కాకుండా పార్టీ కార్యకర్తల్లా జగన్‌రెడ్డి మార్చేశారని విమర్శించారు. పార్టీ కార్యకర్తలుగా మార్చడంతోనే ఎన్నికల కమిషన్ పథకాల పంపిణీకి వారికి దూరం చేసిందని తెలిపారు. నాయకులు బి.రమేష్, ఎస్.మోహనరావు, మణిచంద్రప్రకాష్, సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు.

కలిశెట్టి, ఎన్ఈఆర్‌లను కలిసిన నాయకులు

జి.సిగడాం: పార్టీ బలోపేతంతో పాటు అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మండల టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)లను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యమని మీ గెలుపునకు గ్రామాల్లో ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బెవర జగన్నాథరావు, సర్పంచ్ కామోజుల సీతారాం, మాజీ సర్పంచ్‌లు టంకాల రమణ, సూర్యనారాయణ, చిత్తిరి గోవిందరావు, జనసేన, బీజేపీ నాయకులు వజ్జపర్తి రఘురాం, మీసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి విజయానికి సహకరించండి


మాట్లాడుతున్న కళావెంకటరావు

రాజాం: అందరు కలిసి కట్టుగా పనిచేసి బీజేపీ అభ్యర్థి విజయానికి సహకరించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు కోరారు. ఈమేరకు సోమవారం రాజాంలో ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు కళా వెంకటరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొత్తు ధర్మం పాటించి ముందుకువెళ్లడం మన ముందున్న కర్తవ్యమని తెలిపారు. పలువురు నాయకులు బావోద్వేగానికి గురయ్యారు. పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గం బీజేపీకి ఇవ్వడం వల్ల పార్టీ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కచ్చితంగా టీడీపీ గెలుచుకుంటుందని సంకేతాలు ఉన్నాయని, ఈ సమయంలో ఈవిధంగా చేయడం పార్టీకి నష్టవస్తుందని ఆయన ముందు పలువురు కన్నీళ్లు పెట్టారు.

దిగజారుడుతనానికి నిదర్శనం

కంచిలి: ఎన్నికల సమయంలో వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే, ఆ అంశాన్ని చంద్రబాబుపై నెట్టడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కంచిలి మండల టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం కంచిలిలో మాదిన రామారావు తదితరులు విలేకరులతో మాట్లాడారు. పింఛన్ల పంపిణీకి సంబంధించిన నిధులు విడుదలచేయకపోగా, ఆలస్యానికి కారణం ప్రతిపక్ష నాయకులని దుష్ప్రచారం చేయడం జగన్‌రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సమావేశంలో బొడ్డ హరిబాబు, పిలక చినబాబు, మద్దిల భాస్కరరావు, రామయ్య పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని ప్రోత్సహించింది ధర్మానే

అరసవల్లి: నగరంలో రౌడీయిజాన్ని ప్రోత్సహించింది మంత్రి ధర్మాన, ఆయన తనయుడు రామ్‌మనోహర్ నాయుడేనని టీడీపీ నాయకులు జీవీఆర్ మూర్తి, మూకళ్ల శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విశాఖ-ఏ కాలనీలోని గొండు శంకర్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ధర్మాన రాజకీయల్లోకి వచ్చినప్పటి నుంచీ ఆయన ఎదుగుదలకు హింసే కారణమన్నారు. గతంలో మబగాంలో జరిగిన కాల్పుల్లో ఐదుగురు మృతి చెందడానికి కారకుడు ధర్మానే కారణం కాదా? అని ప్రశ్నించారు. త్వరలోనే ధర్మాన గత చరిత్ర కూడా బయటపెడతామన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

కవిటి: మండలంలోని సహాలాలపుట్టుగలో ఎమ్మెల్యే సతీమణి బెందాళం నిలోత్పల సూపర్‌సిక్స్ పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వ విధానాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అశోక్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ నేతలు మణిచంద్ర, ప్రకాష్, బాసుదేవ్ ప్రదాన్, బి.రమేష్, రంగరౌలో పాల్గొన్నారు.

● **పొందూరు:** ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో ఆర్థికంగా నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని తుంగపేట సర్పంచ్ పప్పల వేణుగోపాల్ తెలిపారు. తుంగపేటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. టీడీపీ నాయకులు తేజ పాల్గొన్నారు.

● **కంచిలి:** మండలంలోని మండపల్లి, కుత్తుమల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మాదిన రామారావు, బంగారు కురయ్య, సనపల కామేష్, వెంకటరమణ, ప్రదీప్, బొడ్డ హరిబాబు పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** చిన్న కాగితాపల్లి, గ్రామ పంచాయతీ బుడ్డివలసలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, నాయకులు నందివాడ గోవిందరావు, కిల్లి సిద్ధార్థ, శ్రేణులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించారు. ప్రచారంలో నాయకులు వాడవలస వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గణపతిరావు, సేపాన కృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన 'గుండ' వర్గం

అరసవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబును హైదరాబాదులో మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పాటుగా వారి వర్గం సోమవారం కలుసుకున్నారు. ఇటీవల శ్రీకాకుళం అసెంబ్లీ టికెట్ వీరికి దక్కలేదు. వారం రోజులపాటు కొంత అసంతృప్తి కూడా నియోజకవర్గంలో చెలరేగింది. ఈ నేపథ్యంలో తనను కలవాలని గుండ దంపతులకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా వారు చంద్రబాబును కలిసి నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, తాము పార్టీకి అందించిన సేవలను చంద్రబాబుకు వివరించారు. అలాగే తమ కుమారుడు విశ్వనాథ్‌ను చంద్రబాబుకు పరిచయం చేశారు. టికెట్ కేటాంపులో పునరాలోచన చేయాలని కోరినట్టు తెలిపారు. పార్టీ నాయకులు ఎం.వెంకటేష్, జల్లు రాజీవ్, కవ్వాడి సుశీల, కొమర కమల తదితరులు ఉన్నారు. ఇదిలాఉండగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తన అనుచరులతో చంద్రబాబును కలవనున్నారు.


హైదరాబాదులో మాజీ మంత్రి గుండ, అనుచర వర్గం

నేరుగా పన్నులు చెల్లించాలి

ఇచ్ఛాపురం: ఇంటి, ఖాళీ స్థలం, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, షాపుల అద్దెలు నేరుగా తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లోగాని, సీడీఎంఏ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో గాని చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులకు సంబంధించి ఫోన్‌పే ద్వారా చెల్లించాలని కొందరు అజ్ఞాత వ్యక్తులు ట్రూకాలర్ ద్వారా మునిసిపల్ కమిషనర్ పేరు ఉపయోగించి ప్రజలకు మోసగిస్తున్నారని పేర్కొన్నారు. అజ్ఞాత వ్యక్తుల బారిన పడకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి చెల్లించాలని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయమై టౌన్ పోలీసలకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బీజేపీ మండలాధ్యక్షులు, కమిటీ సభ్యులను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వర రావు, పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో నూతన కమిటీలు వేసినట్లు పేర్కొన్నారు. మునిసిపాలిటీ అధ్యక్షుడిగా ఆశి సత్యంరెడ్డి, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల అధ్యక్షులుగా బర్రి రాంమూర్తి, ఉప్పాడ కృష్ణమూర్తి, పి.దుర్యోధన, టి.కృష్ణారావు, కమిటీ సభ్యులుగా లండ సుశీల, డి.మురళి, సాలిన దుర్యోధన, పుక్కల కామేష్‌లను నియమించినట్లు తెలిపారు. జిల్లా నాయకుల ఆదేశాల మేరకు నూతన కమిటీల ద్వారా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని జిల్లా జనరల్ సెక్రటరీ వైకుంఠరావు కూడా ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు.

ఎడాక్స్ కోర్సులతో ప్రయోజనం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఇటీవల ప్రారంభించిన ఎడాక్స్ కోర్సులతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనమని వర్సిటీ వీసీ కేఆర్ రజని తెలిపారు. వర్సిటీ అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సోమవారం ఆమె ఆన్‌లైన్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కోర్సు కోసం ఇప్పటి వరకు సుమారు 2 వేల మంది ఈ మెయిల్ ద్వారా రిజిస్టర్ అయ్యారని, ఈ సంఖ్య మరింత పెరగాలన్నారు. వర్సిటీ నుంచి సాంకేతిక బృందాలను ఆయా కళాశాలలకు పంపిస్తామన్నారు. ఈ కోర్సులను విద్యార్థులు వినియోగించుకునేలా ఆయా కళాశాలలు వర్సిటీ బృందం ద్వారా సాంకేతిక సాయం పొందవచ్చన్నారు. పూర్తిస్థాయి సమాచారంతో ఈ నెల 6న నిర్వహించే సమీక్ష సమావేశానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, వర్సిటీలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖర్, ఎడాక్స్ అడ్మిన్ జి.రామకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సర్వేశ్వరరావు


సర్వేశ్వరరావు

సోంపేట: సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.సర్వేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కోర్టులో సోమవారం మధ్యాహ్నం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా ఎస్.విశ్వనాథం, కార్యదర్శిగా డి.జగన్నాయకులు, కోశాధికారిగా వి.ధర్మారావును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి వీసీపట్నాయక్, జీఎస్ శైలేంద్ర, జీ.పున్నయ్య, బొడ్డ ధర్మారావు, దుప్పల చలపతి, కేవీఆర్ తదితరులు అభినందించారు.

నిధుల కొరతే కారణం

అరసవల్లి: సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్ల పంపిణీ జరగకపోవడానికి నిధుల కొరతే కారణమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు స్పష్టం చేశారు. సోమవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పేదలకు ఇవ్వాల్సిన పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లలను మార్చి నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్‌రెడ్డి దోచిపెట్టారని ధ్వజమెత్తారు. దీంతో పింఛన్ల సొమ్ములు ఇవ్వడానికి ఖజానాలో సరిపడా నిధులు లేకుండా పోయాయన్నారు. తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలపై, ఎన్నికల కమిషన్‌పై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార, తెలుకుల కమిటీ సభ్యుడు కొమనాపల్లి వెంకటరామరాజు, బొనిగి భాస్కరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులతో పింఛన్లు ఇప్పించండి

పొందూరు: వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే ప్రత్యామ్నాయంగా సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పైడి నాగభూషణరావు కోరారు. రాష్ట్రంలో పేదలకు ప్రతినెలా అందజేస్తున్న పింఛన్లతో అధికార వైసీపీ ఆటలాడుతోందని విమర్శించారు. సోమవారం కింతలిలో విలేకరులతో మాట్లాడారు. పింఛన్లు పంచే నెపంతో వలంటీర్లతో ప్రచారం చేయించాలని వైసీపీ పన్నాగం పన్నిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌కు అందిన ఫిర్యాదుతో వలంటీర్లను తొలగించడంతో వైసీపీ పన్నాగం పారలేదని, రాష్ట్రంలో 1.35 లక్షలు సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, వారితో పంపిణీ చేయిస్తే రెండు రోజుల్లోనే పూర్తిచేయవచ్చన్నారు. ఖజానాలో నిధులు లేకపోవడంతో పింఛన్ల పంపిణీపై ఈ విధమైన ఆరోపణలు వైసీపీ చేస్తోందని ఆరోపించారు.

అక్రమ మద్యంపై దృష్టి సారించండి

పొందూరు: ఎన్నికల సమయంలో అక్రమ మద్యం రవాణాపై దృష్టి సారించాలని ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం ఆదేశించారు. సోమవారం పొందూరులోని ఎస్ఈబీ స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్న బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించాలని ఎస్ఈబీ ఎస్ఐ ఈ. రామకృష్ణను ఆదేశించారు. అక్రమ మద్యం విక్రయాలకు సహకరించినట్లు సిబ్బందిపై ఆరోపణలు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

గొడవలకు పాల్పడితే కేసులు

కంచిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ మల్లేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం అర్జునాపురంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.రాజేష్ పాల్గొన్నారు.

రిటైర్డు హోంగార్డులకు సత్కారం

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు శాఖలో హోంగార్డు విభాగంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వి.ఉమామహేశ్వరరావు, జి.రాజులను ఎస్పీ జీఆర్ రాధిక సత్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధికను వారు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరికి తక్షణ సాయం కింద రూ.ఐదు వేలు చొప్పున చెక్కును అందజేశారు. భవిష్యత్తులో ఎటువంటి అవసరం వచ్చినా పోలీసు శాఖ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి నాయుడు, ఆర్ఐ కేవీ నర్సింగరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.